# గాలిలో హత్య

"హత్య! సినిక్ ఘోరహత్య!" హడావిడిగా లోపలికి ప్రవేశించాడు డిటెక్టివ్ సుగ్రీవ. కుమార్, చైత్రశ్రీ, శాస్త్రి, నేనూ ఆశ్చర్యపోయి చూస్తున్నాం.

మేం అయిదుగురం ఒకే రూమ్‌లో పడే అదృష్టం కలిగింది. యూనివర్సిటీ కంతటికీ ఎత్తైన కొండదిబ్బమీద భగవానుని పవిత్ర నామంమీదుగా కట్టిన ఆ బ్లాకు మూడవ అంతస్తులోని మారుమూలగదే మాది. మా అయిదుగురు రూంమేట్సు కూడా వారి వారి 'కళ'లలో అతి నిపుణులు.

డిటెక్టివ్ సుగ్రీవ హెర్క్యూల్ పాయిరట్‌ని మించిన డిటెక్టివ్. కాల్చి పారేసిన సిగరెట్టు పీకల్ని జేబురుమాలుతోనే తీసి అవతల పారేస్తాడు. అతన్ని క్లాసులోనూ, కలల్లోనూ కూడా డిటెక్టివ్ లే పలకరిస్తారు. హత్యాసాహిత్యం అంతా ఏ భాషలోదైనా సరే-కాచి వడబోసి తాగేశాడాయన.

కుమార్ గొప్ప నాటకకళాకారుడు. ఉత్తమనటుడుగా మూడుసార్లు, 'ఉత్తమ నటి'గా నాలుగుసార్లు బహుమానా లందుకున్నాడాయన. ఇంట్లోనూ, బయటాగూడ నాటకంఫక్కీలోనే మాట్లాడుతాడు. రాత్రిళ్లు "జానకీ! తుంపరులు పడుతున్నాయి, తలుపు వేసెయ్యి!" అని కలవరిస్తాడు, మేమందరము ఉలిక్కిపడేలా. తన రసికత్వాన్ని స్థిరపర్చుకోడానికి ఒక ఊహాసుందరితో అప్పుడప్పుడు స్వప్నాల్లో అలా మాట్లాడుతూంటాడాయన.

'చైత్రశ్రీ' అనేది ఒక పారడీ, ఈనాటి అశోక శ్రీలమీద. ఆయన కవిత్వం 'అగ్గి నిప్పు'లాగుంటుంది. మనిషికూడా అలాగే ఉంటాడనుకోండి. ఆయనకు భయపడి ఆయన కవితాజలాన్ని ఆముదంలాగా గుటకలు వేసేవాళ్లం మేమంతా. ఆయన అభ్యుదయవాది; అంటే మన పాతసారస్వతాన్నంతటినీ బుట్టదాఖలాచేసేసి, క్రొత్తకవిత్వం పూర్తిగా విజృంభించేదాకా తను వ్రాసినవే చదువుకోమంటాడు.

శాస్త్రి ఎప్పుడూ ఎవరిసంగతీ పట్టించుకోలేదు, ఇకముందు పట్టించుకోడుగూడా. ఎప్పుడూ గోడవైపు తిరిగి కూర్చొని ఏ ఎప్లయిడ్ మెకానిక్సో చదువుతూంటాడు. సినిమాలు చూడడు; స్త్రీయిక్కుల్లో పాల్గోడు. క్లాసుకి అరగంట ముందుగా వెళ్తాడు. మేష్టార్లని వచ్చి లీజర్ గంటలో ఏమైనా చెప్పమంటాడు మమ్మల్నందర్నీ చంపేందుకు. ఇదంతా చూసి మా క్లాసులో వాళ్లంతా "పకోడీ" అనే బిరుదు ఆయనకు ప్రసాదించారు. ఆయనంటే ఇంకా కొంచెం ఎక్కువ అభిమానం గలవారు ఆయన్ను 'ఘనపకోడీ' అనీ "వీరపకోడీ" అనీకూడ పిలుచుకుంటూంటారు.

ఇక సినిక్ (మన కథానాయకుడు.) కూడ అసలు పేరుకాదు, పై అన్నిపేర్లలాగే. డ్రాయింగ్ పేపర్లో మూడుసార్లు తన్నేసిన తర్వాత జీవితంమీదా, తనమీదా కూడ విశ్వాసంపోయి, ఎప్పుడూ ఆసముద్రం వైపున్న కిటికీదగ్గర కూర్చొని దూరంగా శూన్యంలోకి శూన్యంగా చూస్తూంటాడు. "జీవితమంతా మిథ్య. కష్టసుఖాలు, కలిమిలేములు కావడికుండలు" అనేవాడు మాకేదైనా ఘనకార్యం జరిగి సంతోషిస్తున్నా, లేక పరీక్ష ఎగిరితంతే ఏడుస్తున్నా. మా

డి. హనుమంతరావు

ఉడుకుతున్న వేడిరక్తంమీద చన్నీళ్లు చిలకరిస్తుండేవాడు. ఆ క్షణాల్లో మా కతని మీద పట్టరాని కోపంవచ్చేది.

'దేవుడూ, గీవుడూ జాంతానై! చావు అనేది చాలా స్వర్గప్రాయం' అని మాకు నీతిబోధ చేస్తూండేవాడు. ఇలా ఉంటూండగా ఒకరోజు ఈ సినిక్ అకస్మాత్తుగా మాయమయ్యాడు. ఆరోజు రాలేదు. మరునాడు, మూడోరోజుకూడ రాలేదు. ఎప్పుడూ వేసవిసెలవలకికూడ ఇంటికి వెళ్లకుండా కాలేజీ, కిటికీ తప్ప ఇంకోటి ఎరగని సినిక్ ఇన్నాళ్లు కనబడకపోయేసరికి మాకందరికీ చాలా అనుమానం కలిగింది. ఒకవేళ ఆత్మహత్యయేమో ననుకున్నాం. డిటెక్టివ్ సుగ్రీవ కిప్పుడు మంచిపని తగిలింది. ఇంతవరకెప్పుడూ పుస్తకాలు, పెన్నులు పోతే డిటెక్ట్ చేశాడేగాని హత్యలతో సంబంధం పెట్టుకోలేదు.

"ఇది ఆత్మహత్యగాదు; ఖచ్చితంగా హత్యే!" అంటాడు డిటెక్టివ్. మమ్మల్నందర్నీ నేలమీద అడుగులు వేయకుండా బయటికి వచ్చేయమన్నాడు. కళ్లు పెద్దవి చేసుకొని అడుగుజాడల్ని కనిపెట్టుతూ వెళ్లాడు. అక్కడో చిన్న కాగితంముక్క కనబడింది. దాన్ని నెమ్మదిగా జేబురుమాలుతో తీసి శాస్త్రోక్తంగా జేబులో పెట్టుకున్నాడు. నెమ్మదిగా నేలమీదున్న అడుగుజాడల్ని పాడుకాకుండా కాపాడుకుంటూ సినిక్ తాలూకు అలమారదగ్గిరకి వెళ్ళి వంటివేలుతో తలుపు తెరిచాడు! ఒక్కసారిగ "రక్తం" అని వెనక్కి వచ్చిపడ్డాడు? మేమంతా లోపలికి వెళ్ళి చూసేసరికి అక్కడ ఎర్రసిరాబుడ్డి ఉంది పక్కన. అది పూర్తిగా వలికిపోయుంటుంది. మనవాడు హత్యాధ్యానంలో ఉండడంచేత రక్తం అనుకున్నాడు పాపం. అతని గుండె బరిజేసి "ఎందుకీ హంగామా అంతా! ఆ కాగితం ముక్క ఏంజేస్తావు" అని అడిగాను.

(22-వ పేజీ చూడండి)



బ్రాంచీలు. హైదరాబాదు & విజయవాడ.



# గాలిలో హత్య

(19-వ పేజీ తరువాయి)

"దాన్ని అల్ట్రా వయొలెట్, ఇన్ఫ్రా రెడ్ రేస్ క్రింద పెట్టి పరిశీలిస్తా" నన్నాడు!

"ఉపయోగం"?

"హంతకుడు పట్టుబడిన తర్వాత, వాడి వేళ్ళు, కాళ్ళ ముద్రలు కూడ తీసికొని, అలాగే పరిశీలిస్తే వాణ్ణి ఇట్టే పట్టేయొచ్చు!"

"ఎందుకోయ్ ఈ లేనిపోని గొడవంతా!" అన్నాడు కుమార్.

"గొడవేమిటోయ్! డిటెక్షన్ అనేది పట్టి డికాక్షన్ లాంటిది. ఈ హంగు అంతా కలిపితే పాలూ పంచదారా పోసినట్టవుతుందన్నమాట" విడమర్చి మూలసూత్రం సూక్ష్మంగా చెప్పేశాడు డిటెక్టివ్ సుగ్రీవ!

కాని చిత్రశ్రీ, కుమార్, ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు! ఇది అసలు హత్యేగాదన్నారు వాళ్ళు. ఆత్మహత్య చేసేసుకునుంటాడని తీర్మానించారు. శాస్త్రి లెక్కలు చేసుకుంటున్నాడు. నేను అధిక సంఖ్యాకబలంతో ఏకీభవించి, మధ్యాహ్నం పదకొండుగంటలకి మా బ్లాకువాళ్ళందర్నీ శ్రీ సినిక్ గారి ఆత్మశాంతికై స్మారక సభ, డాబామీద జరుగుతుందిగాన హాజరుగావలసిందిగా కోరాను. డిటెక్టివ్ సుగ్రీవకిదేం నచ్చలేదు. ఇది హత్యేగాబట్టి ప్రథమ కర్తవ్యం హంతకుణ్ని పట్టుకోవడం అన్నాడు! చివరికి స్మారకసభలో ఆత్మశాంతికై రెండునిమిషాలు తలవాల్చి నిలబడ్డానికి ఒప్పుకున్నాడు. శాస్త్రిని చదువులోంచి లేపి ఈ విషాదవార్త తెలియజేశాం.

"ఓహో!" అని అతి సాధారణంగా మళ్లీ లెక్కలు చేసేసుకుంటున్నాడు.

"మనమందరం ఏడవాలోయ్!" అన్నాడు కుమార్ గట్టిగా!

"అలాగా! ఇదిగో ఈ లెక్క పూర్తిచేసి!" అన్నాడు శాస్త్రి. మేమందరం ఒకరి మొఖాలొకరు చూసుకొని ఏం చెయ్యలేక ఊరుకున్నాం!

చివరికి పదకొండుగంటలైంది. మారూం మేట్సు ఆరుగురం, మరో నలుగురూ పైకి వచ్చాం.

కుమార్ అధ్యక్షతవహించాడు. చిత్రశ్రీ, మిత్రశ్రీ మీద ఒక చిన్న గేయం వ్రాసి చదువుతానన్నాడు. చచ్చామనుకున్నాం.

"ఓహో సినిక్! ఆహా సినిక్! నిన్ను వదిలి అప్పుడే మూడు రోజులైంది!

కాని సినిక్! నిజానికి నువ్వు మమ్మల్నింకా వదల్లేదు!

మర్చిపోలేం! నేస్తం! నీ జాలిబాధ! విషాద గాథ!

నిన్ను లోకం రెక్కపట్టుకు ఆపి, నీ మెదడులో నాగ జెముడుడొంకలు మొలిపించి,

శాశ్వత సత్యాల్ని నినదించే నీ గొంతుకి ఉరిత్రాళ్లువోసి,

నీదారుల్లో నిప్పులరాసులు ఉంచి-అబ్బ సినిక్!

కాని, నేస్తం! నేను నిన్ను వదల్ను! నీ ఆశయాల్ని, ఆదర్శాల్ని నేల నాలుగు చెరగులా చెరుగుతా!

నిన్ను జీవన్మృతునిగా చేసేస్తా!"

"మా కందరికీ నవ్వొచ్చింది ఆ ఆఖరి మాటకి. పాపం అతని ఉద్దేశ్యం ఏమిటో తెలిసిందే, కాని పాపం ఒకదాని కొకటి అని ఊరుకున్నాడు.

తరవాతఅధ్యక్షులవారు తమ అంతిమ ఉపన్యాసం ఇచ్చారు.

"సోదరులారా! మిత్రుని అస్తమయ వార్త మనఅందర్నీ అగాధాల్లోకితోసింది. దుఃఖసాగరంలో ముంచివేసింది" అని ఒక్కసారి చీది, కళ్ళు తుడుచుకున్నాడు. ఆ తర్వాత ఆకాశంకేసి చూస్తూ "ఎక్కడికి పోయావు మమ్మల్నందర్నీ ఇలా ముంచేసి! మా రోదనలు నీకు వినపడ్డంలేదా! హా చంద్రమతీ!" అని ఒకసారి నాలిక కొరుక్కొని తిరిగి ఉపక్రమించాడు. ఇలా గంటసేపు అతి విషాదంగా నటించి చివర్న "ఈవిషాద సమయంలో అంతగా మాట్లాడ్డం భావ్యంగాదు, అని ముగించేశాడు. ఆ తర్వాత అందరంలేచి నిల్చొని తలవంచుకొని రెండు నిముషాలసేపు అతని ఆత్మశాంతికై ప్రార్థించాం.

గదికి వచ్చేసినతర్వాత, కుమార్ రిహార్సల్ కి వెళ్ళిపోయాడు. డిటెక్టివ్ సుగ్రీవ హత్యగురించి ఆలోచిస్తున్నాడు. చిత్రశ్రీ విషాదంగా మొహంపెట్టి నిద్రపోతున్నాడు. శాస్త్రి పుస్తకపారాయణ చేస్తున్నాడు యథాప్రకారంగా"

ఇంతలోకి చిరునవ్వు నవ్వుతూ ప్రవేశించాడు సినిక్. ఆశ్చర్యం! ఏడాది కంతకీ అదే మొదటిసారి అతను నవ్వింది. ఇంటిదగ్గిర్నుంచి అర్జంటు టెలిగ్రాం వచ్చేస్తే మా ఎవరితోనూ చెప్పడానికి వీలులేక, కట్టుబట్టలతో పాపం ఇంటికి వెళ్ళిపోయాడట! అక్కడితనికి వాళ్లవాళ్లు మంచి అమ్మాయిని చూసేసి పెళ్లి స్థిరపర్చేశారు. "జీవితంలో ఆనందం ఉందోయ్!" అన్నాడు సిగ్గుపడుతూ భావి జీవితాన్ని గుర్తుతెచ్చుకుంటూ. మా కందరికీ తలో 'శుభలేఖా' ఇచ్చాడు. సినిక్ మారాడు! నెమ్మదిగా నోరు వెళ్ళబెట్టి చూస్తున్న డిటెక్టివ్ సుగ్రీవ దగ్గిరకి వెళ్లి "ఎక్కడోయ్! హత్య?" అన్నాను. "గాల్లో!" అన్నాడు. ★



డిస్ట్రిబ్యూటర్లు: పటేల్ & కంపెనీ, సికిందరాబాదు;
ఆల్బర్ట్ కార్డిరొరో & కంపెనీ, వరంగల్లు.